క్లుప్తంగా

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం



నందిపేట్(ఆర్మూర్): గ్రామీణ క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. కుద్వాన్‌పూర్‌లో మంగళవారం ఆర్మూర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ సీజన్–2 క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, నేతలు ఇంద్రుడు, చరణ్ పాల్గొన్నారు.

నేడు కల్తీ కల్లుపై అవగాహన

బోధన్: సాలూర జీపీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 8 గంటలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కల్తీ కల్లు పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మంగళవారం గ్రామ పంచాయతీ అధికారుల తెలిపారు. ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వేల్పూర్: వేల్పూర్ మండల గ్రామాలలో కల్తీ కల్లుపై బుధవారం టీజీఏఎన్‌బీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు జరుగుతాయని ఎస్సై సంజీవ్ మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు పడగల్, 10 గంటలకు వేల్పూర్, మధ్యాహ్నం 3 గంటలకు వాడి, సాయంత్రం 5 గంటలకు పచ్చలనడ్కుడ గ్రామాలలో జరుగుతాయని వెల్లడించారు.

బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తా

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని సంప్రదించి నిధులు మంజూరు చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో కాలువ వద్ద బ్రిడ్జిని, అలాగే గ్రామం నుంచి అర్గుల్ వెళ్లే మార్గాన్ని వినయ్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. అధికారులు అంచనాలను రూపొందించి ఇవ్వాలన్నారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్ విట్టం జీవన్, నేతలు అమృత్‌రావు, వెంకట్రామ్ రెడ్డి, మారుతి రెడ్డి, పవన్ అనంత్‌పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వర్ని: మండల కేంద్రంలో మంగళవారం ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీని నిర్వహించారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఒక టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వర్ని ఎస్సై మహేష్ వెల్లడించారు. బోధన్ ఎంవీఐ శ్రీనివాస్ ,ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, వర్ని ఎస్సై కృష్ణ తనిఖీల్లో పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

నందిపేట్(ఆర్మూర్): గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని నందిపేట ఎస్సై చిరంజీవి అన్నారు. నందిపేట మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, వీటి వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడుతాయని అన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు గ్రామ పెద్దలు, దాతలు సహకరించాలని సూచించారు.

ఆలయానికి వీడీసీ విరాళం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శుక్రవారం దేవి ఆలయానికి ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం రూ.1.50 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



బోధన్: సాలూర మండలంలోని హున్సాలో నూతనంగా నిర్మించిన బుద్ధ విహార్, గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్‌లో మంగళవారం ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని కలిసి గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు ఆహ్వానించారు. ఏఎంసీ ఇన్‌చార్జి చైర్మన్ చీల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



యోగేశ్

రెంజల్(బోధన్): బీజేపీ రెంజల్ మండల అధ్యక్షుడిగా నీలా గ్రామానికి చెందిన క్యాతం యోగేశ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. యోగేశ్ మాజీ వైస్ ఎంపీపీగా పనిచేశారు. గతంలో పనిచేసిన గోపీకృష్ణ పదవీకాలం పూర్తవడంతో నూతన అధ్యక్షుడిగా యోగేశ్‌ను నియమించారు.

కాలువల్లో పూడిక తొలగించరూ..!

- లక్ష్మి కాలువలో పేరుకు పోయిన మట్టి
- ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించాలని ఆయకట్టు రైతుల డిమాండ్



లక్ష్మి మైనర్ కాలువలో పేరుకుపోయిన పూడిక

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి కాలువలో పూడిక బాగా పేరుకు పోయింది. ఉప కాలువల్లో కూడా పెరిగిపోయింది. పూడిక తొలగింటానికి అధికారులు మాత్రం ప్రయత్నం చేయడంలేదు. దీంతో ఏటేటా పూడిక పేరుకు పోయి, నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతోంది. లక్ష్మి కాలువ సామర్థ్యం 500 క్యూసెక్కులు.. కాని ప్రస్తుతం 200 క్యూసెక్కుల నీరు వదిలితే గండ్లు పడే ప్రమాదం ఏర్పడుతోంది. ప్రస్తుతం పల్లెల్లో ఉపాధి హామీ పథకంలో పనులు ఊపందుకున్నాయి. వేసవి కాలం కావడంతో ఉపాధి హామీ పథకంలో అధికంగా కూలీలకు పని కల్పిస్తున్నారు. చెరువుల్లో తవ్వకాలు చేపడుతున్నారు. ఎక్కువ చెరువుల్లో నీరు అధికంగా ఉండటంతో పనులు చేపట్టడానికి అవకాశం లేదు. దీంతో ఇతర పనులు చేపడుతున్నారు. లక్ష్మి కాలువ ముప్కాల్ మండల కేంద్రంతో పాటు నల్లూర్, కొత్తపల్లి, వేంపల్లి, రెంజర్ల, మోర్తాడ్ మండలం శెట్‌పల్లి వరకు ప్రవహిస్తుంది. ఈ గ్రామాల కూలీలతో పూడిక తొలిగించే పనులు చేపడితే ప్రయోజనం ఉంటుంది. ఉన్నత అధికారులు స్పందించి కూలీలతో పూడికతీత పనులు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపుతున్నాం

కాలువల్లో పూడిక తీత కోసం ఉపాధి హామీ కూలీల ద్వారా చేపట్టాలని ఎంపీడీవోలకు ప్రతిపాదనలు పంపుతున్నాం. రెండు రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

ఎస్సారెస్పీ కాలనీ కంపు కొడుతోంది

- లీకేజీ నీటితో కాలనీ పక్కన నిల్వ
- మురుగు నీరుగా మారుతున్న వైనం



కుంటలా నిలిచిన లీకేజీ నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్(ఎస్సారెస్పీ) కాలనీలో నీరు అధికంగా నిల్వ ఉండటంతో కుంటలా మారి కాలనీ అంతా భరించరాని కంపు కొడుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాలనీకి నీటి సరఫరా చేయటానికి కాలనీ నిర్మాణ సమయంలో పైపు లైన్ వేశారు. ప్రస్తుతం ఆ పైపు లైన్ అడుగడున లీకేజీలు ఏర్పడ్డాయి. అలా లీకేజీ రూపంలో వస్తున్న నీరు అంతా కూడా కాలనీలో రోడ్డు పక్కన కుంటలా నిల్వ ఉంటుంది. దీంతో కొన్నాళ్లకు ఆ నీరు మురుగు నీరుగా మారింది. ఆ నీటిలో దోమల పెరిగి స్థానికులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. లీకేజీ నీటి కోసం ప్రత్యేక కాలువ తవ్వితే తప్ప సమస్యకు పరిష్కరమయ్యే పరిస్థితి లేదు. లేదంటే ఆ పాత పైపు లైన్‌ను మూసి వేసి నీటి సరఫరా కోసం కొత్త పైపు లైన్ వేయాలి. కాని అలాంటి పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు. ప్రాజెక్ట్ అధికారులు లేదా జీపీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

చాలాసార్లు చెప్పాం

ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు చాలా సార్లు చెప్పాం. కాని పట్టించుకోలేదు. నీటి నిల్వ లేకుండా చర్యలు చేపడితే ఇబ్బంది ఉండదు. వెంటనే నీటి నిల్వను తొలిగించాలి.

– మిస్బావోద్దీన్, మాజీ సర్పంచ్, పోచంపాడ్

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు

- ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి



మాక్లూర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

మాక్లూర్: ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ, రైతులపై లేదని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి విమర్శించారు. మొన్న రాత్రి కుర్సిన అకాల వర్షానికి మాక్లూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో తడిసి ముద్దయిన వరి ధాన్యం రాసులను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైస్‌మిల్లర్లకు తగిన హెచ్చరికలతో కూడిన ఆదేశాలు ఇవ్వకపోవటంవల్లే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ లోడుతో వెళ్లిన లారీలను రోజుల తరబడి దించుకోకుండా వేధిస్తున్నారన్నారు. చాలా కొనుగోలు కేంద్రాల్లో లారీలు ఉంటే హమాలీలు లేరని ఈ రెండు ఉన్నచోట గన్ని బ్యాగులు, తూకం యంత్రం, సుతిలీలు లేవన్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా అసలే ధాన్యం రైసుమిల్లుకు వెళ్లక రైతులు ఇబ్బంది పడుతుంటే అకాల వర్షం మరో ఇబ్బందిని తెచ్చిపెడుతోందన్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి పక్షం రోజుల్లో కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. లేకుంటే రైతులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, గంగోనే సంతోష్, మదారి మమత, రమేశ్ నాయక్, గంగోనే వినోద్, ముప్ప గంగారెడ్డి, సురేష్ నాయక్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలి



వేల్పూర్/ఆర్మూర్‌టౌన్: పీఎం నరేంద్ర మోదీ రైతులకిచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐయూకేఎస్ ఆర్మూర్ ఏరియా కార్యదర్శి రాజన్న డిమాండ్ చేశారు. మంగళవారం వేల్పూర్, ఆర్మూర్ పట్టణాల్లో ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించి, తహసీల్దార్‌కు, రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఎంఎస్‌పీ కోసం చట్టపరమైన హామీ ఇవ్వాలని కోరారు. నేతలు ఏపీ గంగారాం, గంగాధర్, నాగన్న, లింబన్న, కె.గంగారాం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఆస్తిపన్ను రాయితీ



ఆర్మూర్ పట్టణంలో ఆస్తి పన్ను చెల్లింపు రసీదు అందుకుంటున్న స్థానికుడు(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపును ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎర్లీ బర్డ్ పథకాన్ని గత నెల 1న ప్రారంభిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 30 వరకు అవకాశం కల్పించింది. మళ్లీ ఆస్తిపన్ను రాయితీని ఈనెల 7 వరకు పొడిగించింది. నేటితో ముగియనుండటంతో ప్రజలు త్వరపడాలని మున్సిపల్ అధికారులు కోరుతున్నారు. ఎర్లీ బర్డ్ పథకం ద్వారా మున్సిపాలిటీకి రూ.2.2 కోట్ల ఆదాయం సమకూరింది. మున్సిపల్ అధికారులు 40 శాతం ఆస్తిపన్ను వసూలు చేయడం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 33.3 శాతం వసూలు చేశారు. గతంలో కన్నా ఈసారి ఎర్లీ బర్డ్ పథకంలో ఆస్తి పన్ను వసూల్ ఎక్కువగా చేశారు. మొత్తం 14 మంది బిల్ కలెక్టర్లు, 25 మంది వార్డు అధికారులు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికి తిరుగుతూ ఆస్తి పన్నులు చెల్లించే విధంగా కృషిచేశారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



2025– 26 ఆర్థిక సంవత్సరం 5 శాతం రాయితీతో ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపు బుధవారంతో ముగుస్తుంది. ఇప్పటి వరకు చెల్లించని వారు ఆస్తిపన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. ఆర్మూర్ అభివృద్ధికి సహకరించాలి.

– రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

తడిసిన ధాన్యాన్ని మొదట కాంటా చేయాలి



మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న రైతులు

మాక్లూర్: వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని మొదట కాంటా జరిపించాలని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం మండల కేంద్రంలో నందిపేట రహదారిపై ధర్నా నిర్వహించారు. వారికి మద్దతుగా బీజేపీ నాయకులు ధర్నాలో కూర్చున్నారు. సుమారు అరగంటకుపైగా జరిగిన ధర్నా వల్ల ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో మాక్లూర్ ఎస్సై శేఖర్ జోక్యం చేసుకుని రైతులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు. అదే సమయంలోనే అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ రావటంతో రైతులు వారి సమస్యను విన్నవించారు. మాదాపూర్, గంగరమంద, వేణుకిసాన్‌నగర్‌తండా రైతులు పాల్గొన్నారు.

నేడు అక్బర్‌నగర్‌లో శ్రీవారి కల్యాణ మహోత్సవం

రుద్రూర్: అక్బర్‌నగర్ శివారులోని ప్రాంతీయ వరి, చెరుకు పరిశోధన కేంద్రంలో గల పద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేద పండితులు శ్రీనివాస్ శర్మ, విష్ణు శర్మ, రోహిత్ శర్మ ఆధ్వర్యంలో హోమం , కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు.

సిద్ధి వినాయక వజ్రోత్సవ సన్నాహక సమావేశం

రుద్రూర్: మండల కేంద్రంలోని సార్వజనిక్ గణేష్ మండలి ఆవిర్భవించి 75 ఏళ్లు కావస్తున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు రావల్సిందిగా వారు కోరారు.

విద్యుత్ ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి



సాలూర మండలం మందర్నాలో వాల్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యుత్ శాఖాధికారులు, స్థానికులు

- విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఏడీఈ నగేష్ కుమార్
- సాలంపాడ్ క్యాంప్, మందర్నా గ్రామాల్లో అవగాహన సదస్సులు



సాలంపాడ్ క్యాంప్‌లో..

బోధన్: విద్యుత్ ప్రమాదాలతో సిబ్బందితో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ బోధన్ డివిజన్ ఏడీఈ నగేష్ కుమార్ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్, మందర్నా గ్రామాల్లో వినియోగదారులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. రైతులు, వినియోగదారులు తమ సొంత విద్యుత్ సంబంధిత పనులను సిబ్బందితో మాత్రమే చేయించుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలుంటే వెంటనే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్(1912)కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఏఈలు కల్యాణ్, డేవిడ్, ఫోర్‌మెన్ గఫార్, లైన్ ఇన్‌స్పెక్టర్లు గంగాకిషన్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ అక్రమ వలసదారులను పంపించాలి

- సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు బీజేపీ నేతల వినతి



వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

బోధన్: విదేశీ అక్రమ వలసదారులను గుర్తించి వెంటనే వారి దేశాలకు తిరిగి పంపించాలని కోరుతూ మంగళవారం పట్టణ కేంద్రంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోను కోరారు. ఈమేరకు బీజేపీ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి గోపికిషన్ మాట్లాడుతూ.. బోధన్ పట్టణ ప్రాంతంలో గత అనుభవాలు, ఘటనలను దృష్టిలో ఉంచుకుని విదేశీ అక్రమ వలసదారులుండే అవకాశం ఉంటుందని వివరించారు. గతంలో ఒకే ఇంటి అడ్రస్‌పై 40 పాస్‌పోర్టులు జారీ అయిన విషయాన్ని గుర్తు చేశారు. పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, పట్టణ మాజీ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ వినోద్, నాయకులు గాదె సందీప్, ఎనుగంటి గౌతం, కందికట్ల వాసు, ఏశాల సూరి, యోగిరాజ్ వైద్య, వేణు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి పార్టీ సత్తా చాటాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్‌లోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ పార్టీ బోధన్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఐసీసీ పిలుపు మేరకు పార్టీని బలోపేతం చేయడం కోసం నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటు చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. 2017కు ముందు నుంచి పార్టీలో ఉన్న వారికే పార్టీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. పీసీసీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, తాహెర్ బిన్ హందాన్, అంతరెడ్డి రాజారెడ్డి, పులి శ్రీనివాస రావు, బిళ్ల రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ మందిరం అభివృద్ధికి సహకరిద్దాం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో గల శ్రీరామ మందిరం అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరారు. మంగళవారం శ్రీరామమందిరాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన అదనపు గదులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఆలయ కమిటీ నిర్మించి అద్దెకు తీసుకున్న వారు ప్రతి నెలా అద్దె చెల్లించి ఆలయ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించారు. డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, నాయకులు బిల్లా రామ్మోహన్, శరత్ రెడ్డి, దాము, విష్ణు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కల్లెడిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు



పచ్చలనడ్కుడలో.. ఎంపీవో సాయిలు

మాక్లూర్: కల్లెడిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారికి ఇల్లు ఉందా లేదా అనేది స్పెషల్ అధికారి నరేందర్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పరిశీలించారు. లబ్ధిదారులు ఆర్థిక పరిస్థితి ఎలా ఉందనేది తెలుసుకున్నారు.

వేల్పూర్: పచ్చలనడ్కుడలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేవారి స్థలాలను ఎంపీవో సాయిలు మంగళవారం సర్వే చేశారు. క్షేత్ర స్థాయిలో స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలించారు.

డిగ్రీలో ప్రవేశాలకు గడువు పెంపు

వర్ని: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పద్మజ తెలిపారు. ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బీజెడ్‌సీ, బీకాం సీఏ, బీఎస్‌ఈ పీహెచ్, బీఏ ఈపీపీ కోర్సులలో అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

వేసవి శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి

బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని బాల్కొండ, మెండోరా ఎంఈవోలు రాజేశ్వర్, శ్రీనివాస్‌లు మంగళవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు డ్రాయింగ్, క్రాఫ్ట్, కరాటే, స్పోర్ట్స్ స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు.

భీమ్‌గల్ మండలంలో..

మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకూ చదువుకుంటున్న విద్యార్థులు భీమ్‌గల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈ నెల 10 నుంచి 24 వరకు నిర్వహించనున్న సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో స్వామి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిక్షణ ఉంటుందని వెల్లడించారు. స్నాక్స్ కూడా అందించనున్నట్లు వివరించారు.

వర్నిలో ఈ నెల 8 నుంచి..

వర్ని: వర్నిలో ఈ నెల 8 నుంచి 25 వరకు వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈవో సాయన్న వెల్లడించారు. వర్ని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఐదో తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు శిక్షణ ఉంటుందన్నారు.

రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాలి

నందిపేట్(ఆర్మూర్): కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే ఉద్దేశంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎంఏవో జ్యోత్స్న భవాని తెలిపారు. మంగళవారం కుద్వాన్‌పూర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులు పట్టాపాసుపుస్తకం, ఆధారు కార్డు జిరాక్స్‌తో పాటు ఆధారు అనుసంధానమైన మొబైల్‌ను వెంట తీసుకురావాలని సూచించారు.

ధాన్యం బస్తాల తరలింపును నిర్లక్ష్యం చేయొద్దు



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

మాక్లూర్: తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంట వెంటనే రైస్‌మిల్లుకు తరలించాలని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంతోపాటు మాదాపూర్‌లోని కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం, రైతులకు చెల్లించిన డబ్బులు, ఇంకా సేకరించాల్సిన ధాన్యం ఎంత తదితర వివరాలను తెలుసుకున్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం సేకరణను వేగవంతం చేయాలన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు అందజేయాలని సూచించారు. ఆయన వెంట డీఆర్డీవో సాయాగౌడ్, ఐకేపీ డీపీఎం సాయిలు తదితరులు ఉన్నారు.